

# కట్నం

ఈ వూళ్లో నాకు తెలియని యిల్లు లేదు. చిన్నా, పెద్దా, పెంకుటిల్లు, డాబా, బంగళా అన్నీ చూశాను. ఇన్ని యిళ్లల్లోనూ ఒక్క యిల్లు మాత్రం నా మీద చెదరని ముద్ర వేసింది. అసలు చెప్పాలంటే అది యిల్లు కాదు పూరిల్లు.

గూనితో వంగిపోయిన వృద్ధురాలి లాంటి చిన్న యిల్లు-పైన రాలిపోతున్న పెంకులు. మసిపట్టిన పొగ గొట్టం. ఎప్పుడో వేసిన తెల్లటి పెయింటు. చుట్టూ అడవిలాగా పెరిగిన చెట్లూ చేమల్లో అక్కడో యిల్లుందని పోల్చుకోవడం కూడా కష్టం. తండ్రులు, తాతలు, ముత్తాతలు ఎవరెవరు నాటిన చెట్లో అవి!

ఇటువైపు జనం ఎక్కువగా రారు. లోపలికి తొంగి చూడగలిగితే ఆ యిల్లు చాలా శుభ్రంగా వుందని తెలుస్తుంది.

ఇంట్లో వున్న మనుషులకు గాలీ, వెలుగక్కర్లేదేమో, కిటికీ తలుపులెప్పుడూ మూసే వుంటాయి. ప్రకృతి పట్ల ఆరాధనాభావం పట్టణాల్లో వున్నవాళ్లకే వుంటుంది. ఊళ్లోని వాళ్లకు చెట్లూ చేమల అందాన్ని గుర్తించటమే తెలియదు. లేని దాని మీద ఆశలు పెంచుకుంటాం, ఉన్న దాన్ని పట్టించుకోం. ఇది లోకరీతి. అందమైన మొక్కలు, పువ్వులు, లతలు, పక్షులు. కిలకిలారావాలు. ఇవేవీ యిక్కడున్న వాళ్లకక్కర్లేదా?

ఎవరో, ఏదో చిన్న వార్త చేరవెయ్యమంటేనూ ఆ యింటికెళ్లాను.

నలభై దాటిన కాస్త లావుపాటి స్త్రీ. మగాళ్లను, ముఖ్యంగా యువకుల్ని చూస్తే ఆమెకు భయం. నా చేతిలో కత్తిలేదు. గొడ్డలి లేదు. తుపాకీ లేదు. కాని యువకులందరూ ప్రమాదకరమైన హంతకులు.

"గుర్తుపట్టలేకపోతున్నాను. మహారాజు లాగున్నారు. ఎవరు బాబూ?" వణుకుతున్న గొంతు. ఆమె యింటి యజమానురాలు చికమసోవా.

**రష్యన్‌మూలం: చెహోవ్.**
**తెలుగు గొంతు: కరుణారుణ**

వచ్చిన పని చెప్పాక, "హో.. రండి.. రండి." అంటూ ఆహ్వానిస్తుంది. ఆ శబ్దం గది నుంచి గదికి ప్రయాణం చేసిన ప్రతిధ్వనిలా ఉంటుంది. ఇంట్లో కలరా బిళ్లల వాసన. గుడ్డలో కట్టి జాగ్రత్తగా దాచిన కొత్త జోళ్లు. కిటికీలకు మంచి పరదాలు. వాటి మీద వాలుతున్న ఈగలు. గోడ మీద పటాలు. మూలన, విరిగిన పింగాణీ కప్పు. చిన్న టేబుల్ మీద సగం అల్లిన మేజోడు. జాకెట్లూ, కోట్లూ కుట్టటానికి కట్ చేసి పెట్టిన గుడ్డలు. పక్క గదిలో చిందరవందరగా పడి వున్న సామాను తీసి శుభ్రం చేస్తున్న యిద్దరు స్త్రీలు.

"క్షమించండి. ఇల్లు శుభ్రంగా లేదు" అంటూ బాధపడింది యింటి యజమానురాలు.

వెనక గది తలుపు వారగా తెరుచుకుంది.

"ఏం కావాలి?"

ఫ్రెంచిలో, "నాన్న పంపిన టై ఎక్కడ వుంది?" స్త్రీ కంఠం.

"ఎవరో అబ్బాయొచ్చి కూర్చున్నాడు. అక్క నడుగు" ఈవిడ ఫ్రెంచిలో.

'మేం ఫ్రెంచి బాగా మాట్లాడగలం గదూ?' అన్నట్టు గర్వంగా చూశాయి

ఆమెకళ్లు.

తలుపు తెరుచుకుంది. మస్లిన్ డ్రెస్సు వేసుకున్న పందొమ్మిదేళ్ల యువతి వచ్చి నమస్కారం చేసింది.

నాతో "మా తమ్ముడు" అంటూ పరిచయం చేసి, "ఈ అబ్బాయి..." అంటూ ఆగింది.

నన్ను పరిచయం చేసుకున్నాను.

"నా భర్త కొనడు. మా గుడ్డలు మేమే కుట్టుకుంటామండి."

"ఉన్న యిద్దరికీ యిన్ని దుస్తులా?"

"ఇవి యిప్పుడు తొడుక్కోవడానికి కాదు, కట్నం కోసం."

"ఓ మమ్మీ! అవన్నీ మాట్లాడక. కొత్త మనిషి, ఆయనేమనుకుంటాడు? నేను అసలు పెళ్లే చేసుకోను." అంది కూతురు సిగ్గుపడుతూ.

'పెళ్లి' మాటతో అమ్మాయి కళ్లు తళుక్కుమన్నాయి.

టీ, బిస్కట్లు, వెన్న, జామ్ వచ్చాయి. తర్వాత వళ్లు. ఏడింటికి మంచి విందు. వక్క గదిలో ఎవరో బిగ్గరగా ఆవులించాడు.

"మా మరిది. కొత్తవాళ్లంటే బెరుకు. ఉద్యోగాలచ్చి రాలేదు. చర్చికి జీవితం అంకితం చేద్దామనుకుంటున్నాడు, పాపం!"

యజమానురాలు, భోజనం తర్వాత మరిది కుట్టిన దుస్తులు తీసుకొచ్చింది. కూతురు కూడా తను చేసిన పని చూపించింది. అంతటితో ఆగక వక్క గదిలోకి తీసికెళ్లి అయిదు పెద్ద పెట్టెల్లో పెట్టిన దుస్తులన్నీ చూపింది.

"ఇదంతా కట్నం కోసమే. మేమే కుట్టాం!"

దిగులుగా వుంది. "మళ్లీ వస్తానండీ" అంటూ లేచాను.

ఉద్యోగరీత్యా, ఏడేళ్లకు మళ్లీ వెళ్లానా వూరు. వాళ్లకు అతిథులెక్కువగా రారేమో, నన్ను బాగా గుర్తు పెట్టుకున్నారు. పెద్దావిడ జుత్తు తెల్లబడింది. మనిషి లావెక్కింది. కళ్లు సరిగా కనిపించడం లేదు కాబోలు. ఇంటి నిండా కట్ చేసి కుట్టటానికి రెడీగా పెట్టిన బట్టలు. కూతురు ఏదో అల్లుతూ కూర్చుంది. అవే డిజైన్లు, అవే గుడ్డలు. అవే కలరా బిళ్లల వాసన. భర్త బొమ్మ గోడకెక్కింది.

జ్ఞాపకాల వెల్లువ...

"మగదిక్కు కూడా లేకుండా పోయింది. మరిది వున్నాడు గానీ ఏం లాభం ? చర్చివాళ్లు కూడా అతన్ని రానివ్వలేదు. ఇప్పుడు తాగుడు మరింత పెరిగింది. భరించలేం. దొంగతనం కూడా చేస్తున్నాడు. రెండు పెట్టెల్లో వున్న దుస్తులు అమ్మేశాడు. ఇలా చేస్తే నా కూతురి పెళ్లెలా అవుతుంది? పోలీసులను పిలుస్తాను. తీసికెళ్లిపోతారు."

"ఎ ు వి ు మ్మ ! ఆయనేమనుకుంటాడు? నాకు పెళ్లే వద్దు." అంటూ సిగ్గుపడింది కూతురు.

ఆడవాళ్ల మాటలకు అర్థం అదే కదా! పెళ్లి వద్దంటే కావాలని.

వక్కగదిలో చిట్టెలుకలాగ తచ్చాడుతున్న బట్టతల మనిషి.

"అంటే కాబోలు మరిది."

తల్లీకూతుళ్లిద్దరికీ వయసు పైబడింది. ఒకరిది ముగ్గుబుట్ట లాంటి తల. శరీరం ముడతలు పడింది. మరొకరికి యవ్వనం గడిచి మధ్య వయసు ప్రవేశించింది.

"దొంగిలిస్తున్నాడు. పోలీసులను పిలుస్తాను" అంటూ చెప్పుకుపోతూనే వుంది. కాసేపటి క్రితమే ఆ మాట చెప్పిన విషయం కూడా మరిచిపోయింది.

"ఇలా చేస్తే మా అమ్మాయికి కట్నం ఏం మిగులుతుందనీ..."

కూతురు సిగ్గుపడింది.

"డబ్బు ఉన్న వాళ్లం కూడా కాదు. మళ్లీ ఎంత బట్ట కొనాలి? ఎన్నాళ్లు కుట్టాలి? ఎప్పుడు పెళ్లి కావాలి?"

గత ఏడాది మళ్లీ ఆ యింటికెళ్లాను. ఈసారి పెద్దావిడ శోకదేవత లాగుంది.

బట్టతల మనిషి చిరుగుపాతల్లో వక్కనే కూర్చున్నాడు. నన్ను చూసి లోపలికి పారిపోయాడు.

"మీరు మళ్లీ రావడం మా అదృష్టం" అందావిడ ఫ్రెంచిలో.


"ఏం కుడుతున్నారు?"

"షర్టు. మరిదికిచ్చి చర్చికి పంపిస్తాను. అది తప్ప నాకేం మిగిలిందని?"

టేబుల్ మీద కూతురి ఫొటో.

"మీ అమ్మ యెక్కడ?" అని అడగడానికి సాహసించలేదు.

నేనక్కడ మరెంతసేపు కూర్చున్నా వాళ్లమ్మాయి రాదు, పలకరించదు, సిగ్గు పడదు! ■



## అజయ్ దేవగణ్‌తో మినీ ఇంటర్వ్యూ

**మీడియాను చూస్తేనే విరుచుకుపడతాడెందుకు?**

"నన్ను నమ్మండి ప్లీజ్! నాకు మీడియా మీద ఎలాంటి ఫిర్యాదూ లేదు. ఎందుకనో జనం నన్నపార్థం చేసుకుంటున్నారు."

**రొమాంటిక్ చిత్రాల్లో చేయటం ఎందుకు మానుకున్నాడు?**

"ఇలాంటి చిత్రాలే చేయాలని ఎప్పుడూ అనుకోలేదు. రొమాంటిక్, ఆక్షన్ చిత్రాల్లో ఏదైనా సమానమైన సంతోషమే కలుగుతుంది. స్క్రిప్ట్ బాగుంటే ఎలాంటిదైనా చేస్తాను."

**కాజోల్‌ను సంతోష పెట్టేందుకు అజయ్ ఏం చేస్తాడు?**

"నాకు వంట హాబీ. అందుకని షూటింగుల్లేనప్పుడు కాజోల్ కోసం ఆమెకు నచ్చిన వంటకాలు తయారుచేస్తాను."

**తండ్రి అయిన అనుభూతి ఎలా వుంది?**

"మా ఇద్దరి మధ్యా మరో కొత్త వ్యక్తి మా సంగతులు, వస్తువులు, అన్నిటినీ పంచుకోవటానికి వచ్చిందనిపిస్తున్నది. ఇది చాలా కొత్తదీ, వింతగా అనిపించే అనుభూతి. అన్నీ వదిలేసి ఎప్పుడూ సుపుత్రిక దగ్గరే వుండిపోవాలనిపిస్తున్నది."